క్లుప్తంగా

రామలక్ష్మికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



చేయూత స్వచ్ఛంద సంస్థ ద్వారా అవార్డు అందుకుంటున్న రామలక్ష్మి

మండపేట: పట్టణంలోని గౌతమి మున్సిపల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని మేకా రామలక్ష్మికి కాకినాడకు చెందిన చేయూత స్వచ్ఛంద సేవాసంస్థ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందజేసింది. అవార్డు గ్రహీత రామలక్ష్మి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. జీవశాస్త్రంలో సాంకేతిక అంశాలను జోడించి విద్యార్థులకు బోధిస్తున్నందుకు, సేట్‌ రీసోర్స్‌ పర్సన్‌గా అందిస్తున్న సేవలకు గాను తనకు ఈ పురస్కారం అందించినట్టు రామలక్ష్మి తెలిపారు. చేయూత స్వచ్ఛంద సేవాసంస్థ 7వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ నగరంలోని సూర్య కళామందిర్‌లో ఈ పురస్కారాన్ని అందించారని తెలిపారు.

రూ.నాలుగు వేలు పలికిన లడ్డూ



అంగర ఆది గణపతి ఉత్సవ శిబిరంలో లడ్డూను అందుకుంటున్న సూరిబాబు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర ఆది గణపతి నవరాత్ర శిబిరంలో శనివారం రాత్రి నిర్వహించిన వేలంలో 18 కేజీల లడ్డూ రూ.నాలుగు వేలు పలికింది. ఉత్సవ నిర్వాహక కమిటీ చైర్మన్‌ పెద్దింశెట్టి సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో గ్రామానికి చెందిన కొండపల్లి సూరిబాబు లడ్డూను అత్యధిక ధరకు పాడుకున్నారు. కాకినాడకు చెందిన షణ్ముఖ స్వీట్‌స్టాల్‌ నిర్వాహకులు గొలకోటి ఈశ్వరరావు, యాళ్ల గణేశ్, గొలకోటి సత్యనారాయణ, యాళ్ల సురేష్‌లు స్వామి వారికి 18 కేజీల లడ్డూ సమర్పించారు. ఉత్సవ శిబిరంలో లడ్డూ తనకు దక్కడం ఆనందాన్ని ఇచ్చిందని సూరిబాబు సంతోషం వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులు మేడేపల్లి కొండ, పడాల రామకృష్ణ, సంకాబత్తుల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో విజేతలకు ఎమ్మెల్యే వేగుళ్ల ప్రశంసలు

మండపేట: ఇటీవల ముంబైలో రంగోత్సవం ఆర్ట్‌ సంస్థ నిర్వహించిన ఇంటర్నేషనల్‌ ఆర్ట్‌ క్యాంపెయిన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు పొందిన విజేతలను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అభినందించారు. పట్టణంలోని శ్రీసత్య డ్రాయింగ్‌ అకాడమీ సంస్థలో చిత్రలేఖనంలో శిక్షణ పొందిన 15 మంది స్థానిక విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని పలు విభాగాల్లో బహుమతులు గెలుచుకున్నారు. ఈ విషయాన్ని డ్రాయింగ్‌ మాస్టారు మందపల్లి సత్యానందం తెలిపారు. ముంబై నుంచి స్వస్థలం విచ్చేసిన విద్యార్థులు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్లను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజేతలను ఎమ్మెల్యే వేగుళ్ల ప్రశంసించారు. ఆయన చేతుల మీదుగా మెడల్స్‌ను, ప్రశంసాపత్రాలను అందించారు. విజేతలు మందపల్లి శ్రీచరణ్, పైడిమళ్ల రాజు, ఇందుగమిల్లి సుధాకర్, కె. శ్రావ్య, ఎన్‌ శ్రావణి, సత్యనారాయణ, ఎస్‌. అరుణ, జీవన్, సత్యానందం, త్రివిక్రమ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌ పరామర్శ



పెనుమళ్లలో సూరిబాబుని పరామర్శిస్తున్న మంత్రి సుభాష్‌ తదితరులు

కాజులూరు: పెనుమళ్లలో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలైన ఎలుగుబంటి సూరిబాబుని ఆదివారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ పరామర్శించారు. సూరిబాబు ఇటీవల బైక్‌పై వెళుతూ అదుపుతప్పి జారి పడ్డాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న సూరిబాబుని మంత్రి సుభాష్‌ పరామర్శించి వైద్యం నిమిత్తం అయ్యే ఖర్చులను తాను భరిస్తానని భరోసా ఇచ్చారు. పెనుమళ్ల, ఆర్యావటం మాజీ సర్పంచ్‌లు వనుం వీరబ్రహ్మం, కోట తాతబ్బాయి, మండల గౌడ సంఘం అధ్యక్షుడు అంగర కృష్ణ, కార్యదర్శి అంగర శ్రీనివాస్‌గౌడ్, పేపకాయల బాబ్జి తదితరులు సూరిబాబుని పరామర్శించిన వారిలో ఉన్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో ఏలూరు రేంజ్‌ ఐజీ

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామిని ఏలూరు రేంజ్‌ ఐజీ గోరంట్ల వెంకటగిరి అశోక్‌కుమార్‌ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి, ఆలయ అసిస్టెంట్‌ కమిషనర్‌ ముదునూరి సత్యనారాయణరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన స్వామికి విశేష పూజలు జరిపారు.

సాగులో సస్యరక్షణే కీలకం

- మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు
- రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు



ఎరువులు చల్లుతున్న రైతు

రామచంద్రపురం: రైతులు వరి సాగులో సరైన సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. పంటను ఆశించే తెగుళ్లను ముందస్తుగా గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని, లేదంటే నష్టాలు చవిచూడాల్సి వస్తుందని, హెచ్చరిస్తున్నారు. ఖరీఫ్‌ సాగు చేస్తున్న వరి పంట ప్రస్తుతం అంతటా నాట్లు వేయగా పంట పచ్చగా ఉంటూ పంటకు తెగుళ్లు సోకే అవకాశం ఉండటంతో వ్యవసాయ శాఖ సిబ్బంది సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఖరీఫ్‌లో వరినాట్లు పూర్తి చేసి పంట సస్యరక్షణ పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. అవసరమైన సలహాలు సూచనలు అందిస్తూ అన్నదాతకు అండగా నిలుస్తున్నారు.

జింక్‌ లోపం నివారణ

జింక్‌ లోపం ఉన్న పంటలో 3 లేదా4 ఆకులతో ఈనె పాలిపోతుంది. నాటిన 2 నుంచి ఆరు వారాల్లో ముదురాకు మధ్యలో ఈనెలకు ఇరువైపులా తుప్పు రంగు మచ్చలు ఏర్పడి ఆకు పెళుసుగా ఉంటుంది. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే పైరుపై జింక్‌ సల్ఫేట్‌ ద్రావణం తగినంత మోతాదులో పిచికారీ చేసుకోవాలి.

కాండం తొలచు పురుగు నివారణ

నారుమడి నుంచి పూత దశ వరకు వరి పంటకు కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉంది. పిలక దశలో మొవ్వ చనిపోవటం, పూత, దశలో తెల్లకంకులు ఏర్పడడం జరుగుతుంది. దీని వల్ల దిగుబడి బాగా తగ్గిపోతుంది. దీని నివారణకు కార్టప్‌ హైడ్రోక్లోరైడ్‌ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. కార్బొఫ్యూరాన్‌ 3 గ్రాముల గుళికలు ఎకరాకు పది కిలోలు వాడాలి.

ఆకుముడత

గొంగళి పురుగు ఆకుముడతలో ఉండి పత్రహరితాన్ని తినేయటం వలన ఆకులు తెల్లబడతాయి. దీని నివారణకు క్లోరిపైరిపాస్‌ 2.5మి.లీ ఒక లీటరు నీటికి కలిపి తగినంత మోతాదులో పిచికారీ చేసుకోవాలి.

సుడిదోమ

సుడిదోమ వ్యాపిస్తే వరిపొలంలో దోమ ఉధృతి వల్ల ఉన్న చోట పంట ఎండిపోతుంది. నివారణకు ట్రైసైక్లోజోల 0.6గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. గట్లపై కలుపు నివారించుకోవాలి.

ఆకు ఎండు తెగులు.. నివారణ

బ్యాక్టీరియా వలన ఆకు ఎండు తెగులు వస్తుంది. నత్రజని ఎరువులు తక్కువ పరిమాణంలో ఎక్కువ సార్లు వేసుకోవాలి. పొలం ఆరబెడుతూ నీటి తడులు తగ్గిస్తూ వేసుకోవాలి.

పొట్టకుళ్లు తెగులు

వెన్నులు పొట్టలోనే కుళ్లిపోతాయి. దీంతో పంటకు తీవ్ర నష్టం కలుగుతుంది. దీనిని నివారించేందుకు కార్బండజోమ్‌ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పొట్ట దశలో ఒక సారి, వారం రోజుల తరువాత రెండోసారి పిచికారీ చేసుకోవాలి.

నీటి యాజమాన్యం..

పిలకలు వేసే దశలో పైరు దుబ్బు వేయటం పూర్తయ్యే వరకు పొలంలో 2 సెంటీమీటర్ల నీరు ఉండాలి. చిరు పొట్ట దశలో పూతదశలో పొలంలో 5 సెంటీమీటర్ల నీరు ఉండేలా చూసుకోవాలి. పంట పూర్తిగా వెన్ను వచ్చిన తర్వాత క్రమంగా నీరు తగ్గిస్తూ ఉండాలి.

ఎరువుల యాజమాన్యం

భూసార పరీక్షలకు అనుగుణంగా రసాయన ఎరువులు, సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు వాడి పైరుకు సమతుల్యంగా పోషకాలను అందజేయాలి. ఎకరాకు నత్రజని 96 కిలోలు, భాస్వరం 32 కిలోలు, పొటాష్‌ 32 కిలోలు అందేలా ఎరువులు వేసుకోవాల్సి ఉంటుంది.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



వరి పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి. నీటి యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలి. చిన్నపాటి మెళకువలు అనుసరించడం వలన పెట్టుబడులు తగ్గడంతో పాటు దిగుబడులు బాగుంటాయి. ఆర్బీకేల ద్వారా రైతులను చైతన్య పరుస్తున్నాం. రైతులకు అవసరమైన ఎరువులు ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయి. ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి.

– సత్యప్రసాద్, ఏఓ, రామచంద్రపురం మండలం

ఉపనిషత్తుల సారమే భగవద్గీత

వెదురుపాకలో చిన్నారులకు భగవద్గీత శ్లోక పఠన పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఆధ్యాత్మిక ప్రవచన కర్తలు, కమిటీ సభ్యులు

రాయవరం: భగవద్గీత అనేది ఉపనిషత్తుల సారమని, గీతా పఠనం కర్తవ్య నిర్వహణకు, పాప హరణకు మార్గమని ఆధ్యాత్మిక ప్రవచనకర్తలు బ్రహ్మశ్రీ గోవిందవర్జుల దుర్గానాగేంద్ర భాస్కర శర్మ, బ్రహ్మశ్రీ కొత్తూరి భవానీశంకరశర్మ అన్నారు. మండలంలోని వెదురుపాకలో గీతా మందిరం నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు భగవద్గీత శ్లోక పఠన పోటీలు నిర్వహిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న దుర్గానాగేంద్ర భాస్కరశర్మ, భవానీశంకరశర్మ మాట్లాడుతూ బాల్యం నుంచే భగవద్గీత పఠిస్తే విద్యార్థుల్లో ఆధ్యాత్మికత, నైతిక విలువలు, మానసిక ఒడిదుడుకలను ఎదుర్కొనే శక్తి అలవడతాయన్నారు. గీతా మందిరం నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఆదివారం గీతా మందిరం వద్ద విద్యార్థులతో ఉచితంగా భగవద్గీత అధ్యయనం చేయిస్తున్నామన్నారు. తొలుతగా విద్యార్థులకు ఒకటి, 18 పర్వాల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతి ఆదివారం భగవద్గీత అధ్యయనం చేస్తున్న విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. భగవద్గీతలోని మొదటి అధ్యాయం కంఠస్థ పోటీలలో గెలుపొందిన చిన్నారులకు స్వర్గీయ కొవ్వూరి పద్మావతి స్మారక ట్రస్ట్‌ మెమెంటోస్‌ బహూకరించారు. భగవద్గీత మొత్తం 18 అధ్యాయాలూ క్షుణ్ణంగా పారాయణం చేసిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు, గ్రామస్తులకు కొవ్వూరి సోమిరెడ్డి, వరలక్ష్మి, సత్తివెంకటరెడ్డి, కమలావతి దంపతులచే అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గీతా జ్ఞాన మందిరం కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొత్తపేట డీఎస్పీగా గోవిందరావు

కొత్తపేట: స్థానిక డీఎస్పీగా వై.గోవిందరావు నియమితులయ్యారు. గతంలో డీఎస్పీగా పనిచేసిన కేవీ రమణ నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇక్కడి నుంచి బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ఇంతవరకూ ఇన్‌చార్జ్‌గా అమలాపురం జిల్లా దిశ (మహిళా పోలీస్‌) విభాగం డీఎస్పీగా పనిచేస్తున్న వై. గోవిందరావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కాగా ప్రస్తుత బదిలీల్లో భాగంగా ఇన్‌చార్జ్‌ గోవిందరావునే కొత్తపేట ఫుల్‌ చార్జ్‌ డీఎస్పీగా నియమిస్తూ డీజీపీ సీహెచ్‌ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు.

ముగింపు దశకు గణేశ్‌ ఉత్సవాలు

మండపేట: గణనాథుని ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. పట్టణంలో వీధివీధినా వెలసిన విఘ్ననాథులు భక్తుల పూజలు అందుకున్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో ప్రతి మంటపం వద్దా కనుల పండువగా విశేష పూజలు జరిపించి, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నవరాత్రుల ముగింపు సందర్భంగా ఆదివారం చైర్‌పర్సన్‌ పతివాడ దుర్గారాణి, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు స్థానిక తర్వాణీపేటలోని వరసిద్ధి వినాయకుడిని దర్శించుకుని పూజలు చేశారు. కమిటీ నిర్వాహకులు గుండు తాతరాజు, తెల్లాకుల వేణుగోపాల్, రాము తదితరులు వారికి ఘన స్వాగతం పలికారు. సరస్వతీ పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగేశ్వరరావు చేతుల మీదుగా చిన్నారులకు, విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ గుండు రామతులసి, మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ చుండ్రు శ్రీవరప్రకాష్, వేగుళ్ల అజయ్‌బాబు, బన్నారావూరి వరప్రసాద్, గ్రంధి బుల్లిబాబు, పి.శ్రీను, కోడూరి నాగరాజు, ఆరేటి మహేష్‌ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు చైర్‌పర్సన్‌ పతివాడ దుర్గారాణి మున్సిపల్‌ కార్యాలయంలో అధికారులు ఏర్పాటు చేసిన గణనాథుని దర్శించుకుని పూజలు చేశారు.



మండపేట తర్వాణి పేటలో స్వామి వారి దర్శనం చేసుకుంటున్న ఎమ్మెల్యే వేగుళ్ల, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ దుర్గారాణి

వేలంలో లడ్డూ పాడిన చైర్‌పర్సన్‌

మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పతివాడ దుర్గారాణి శనివారం రాత్రి తన ఇంటి సమీపంలో ఉన్న తర్వాణీపేటలోని వరసిద్ధి వినాయకుణ్ణి దర్శించుకున్నారు. అక్కడ నిర్వహించిన దీపాలంకలో ఆమె పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన లడ్డూ వేలం పాటలో ఆమె పాల్గొన్నారు. అక్కడి గణనాథునికి సమర్పించిన లడ్డూను ఆమె రూ 10,250 దక్కించుకున్నారు. నిర్వాహకులు గుండు తాతరాజు, రామతులసి దంపతులు, బన్నారావూరి వరప్రసాద్, గ్రంధి బుల్లిబాబు, కోడూరి శ్రీనివాస్, పాలమూరి శ్రీను, తెల్లాకుల వేణుగోపాల్, కోడూరి నాగరాజు, ఆరేటి మహేష్, బొల్లంరెడ్డి స్వామి, రంబాల రాంబాబు, రావూరి భాస్కరరావు, కురసా రమణ తదితరులు లడ్డూను చైర్‌పర్సన్‌ తలపై పెట్టి అభినందించారు. కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్‌ చిట్టూరి సతీష్, స్థానికులు పాల్గొన్నారు.



తర్వాణీ పేటలో లడ్డూ ప్రసాదాన్ని శిరస్సు పైకెత్తుకున్న చైర్‌ పర్సన్‌ దుర్గారాణి

నదీ రేవుల వద్ద నిమజ్జనాలకు ఏర్పాట్లు

కపిలేశ్వరపురం: గణేశ్‌ విగ్రహాల నిమజ్జన వేడుకకు మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. గోదావరి నదీ తర గ్రామాలైన కపిలేశ్వరపురం, కోరుమిల్లి, తాతపూడిలలో నిమజ్జనం చేసుకునేందుకు అధికారికంగా అనుమతులు ఇచ్చారు. ఆయా పుష్కర ఘాట్‌ల వద్ద పడవలు, వీధిలైట్లు ఏర్పాటు చేశారు. పారిశుధ్య కార్మికులు రేవులను ఇప్పటికే పరిశుభ్రం చేశారు. ఆయా గ్రామాలతో పాటు వెదురుమూడి, నల్లూరు గ్రామాల్లోని కోరంగి కెనాల్‌ పంట కాలువ రేవుల్లో నిమజ్జన కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. నిబంధనలను విధిగా పాటిస్తూ నిమజ్జనాలను చేసుకోవాల్సిన అవసరాన్ని నిర్వాహకులు గుర్తించాలని ఎంపీడీఓ కొండలరావు, తహసీల్దార్‌ చిన్నారావు, ఎస్సై రవికుమార్‌ సూచించారు.



కపిలేశ్వరపురం ఘాట్‌ వద్ద విద్యుత్‌ దీపాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సంస్థాగతంగా బలోపేతం చేయాలి

కాజులూరు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నాటికి రాష్ట్రంలో బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి బీజేపీ కార్యకర్తపైనా ఉందని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సలాది వీవీ సత్యనారాయణ అన్నారు. ఆదివారం కాజులూరు శివారు శ్రీరామ్‌నగర్‌ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల పార్టీ యువమోర్చా అధ్యక్షుడు నిమ్మల రాజేష్, సభ్యత్వాల నమోదు కమిటీ కన్వీనర్లు పినిపే సతీష్‌చంద్ర, జక్కా శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో పార్టీ కేంద్రంలో బలంగా ఉందన్నారు. కార్యకర్తలు మండల గ్రామాల్లో ఇంటింటా పర్యటించి గడచిన 10 ఏళ్లలో బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై కరపత్రాలు, ఆటో ప్రచారం ద్వారా ప్రజలకు వివరిస్తూ ప్రతి ఒక్కరూ సభ్యత్వాలు స్వీకరించేలా కృషి చేయ్యాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శులు పోలిశెట్టి శ్రీనివాస్, పుణ్యమంతుల శివాజీ, జక్కా శ్రీనివాస్, దేవు పట్టాభి తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామ్‌నగర్‌ బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వీవీ సత్యనారాయణ

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మండపేట: బాత్రూంలో బీపీ వచ్చి పడిపోయిన వృద్ధుడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. దీనిపై టౌన్‌ ఎస్‌ఐ హరికోటి శాస్త్రి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని న్యూ కాలనీకి చెందిన బొలిశెట్టి సత్యనారాయణ (63)కు ఆరోగ్యం బాగాలేకపోవడంతో అతడిని భార్య సుబ్బలక్ష్మి ఈ నెల ఎనిమిదో సాయంత్రం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించింది. అనంతరం ఇంటికి తీసుకు రాగా అదేరోజు రాత్రి ఒంటిగంట సమయంలో బాత్రూంకు వెళ్లిన సత్యనారాయణ బీపీ వచ్చి ముందుకు పడిపోయాడు. దాంతో అతడి తలకు గాయమైంది. వెంటనే తొలుత రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి, తర్వాత అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పంపారు. కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఆ వృద్ధుడు మరణించాడు. మృతుడి భార్య సుబ్బలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు, భార్య ఉన్నారు.

తగ్గుముఖం పట్టిన వరద

అలమూరు: గౌతమీ గోదావరికి సంభవించిన వరదల వల్ల గత వారం రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న లంక ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వరద ప్రాంతాల్లో అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా చొప్పెల్ల పీహెచ్‌సీ అధికారులు ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఉద్యాన, వాణిజ్య, కూరగాయ తోటల్లో వరద నీరు క్రమేపీ తగ్గుముఖం పట్టింది. అధికారులు సత్వరమే పంట నష్టం అంచనా వేసి పరిహారాన్ని అందజేయాలని లంక గ్రామాల రైతులు కోరుతున్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మండలంలోని వశిష్ఠ, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వేపై వరద ఉధృతి కొనసాగుతోంది. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలతో పాటు, జిల్లా సరిహద్దులో ఉన్న అయోధ్యలంక, పెదమల్లంక, సిర్రావారిలంక, ఆనగర్లంక ప్రజలు పడవలపైనే వెళ్తున్నారు. లంక భూముల్లో చేతికి అంది వచ్చిన పంటలు వరదల వల్ల పాడైపోయిన నేపథ్యంలో ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



జొన్నాడ వద్ద నిలకడగా గౌతమీ గోదావరి

వరద నుంచి తేరుకున్న గ్రామాలు

అయినవిల్లి: వరద నుంచి లంక గ్రామాలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. పల్లపు ప్రాంతాల్లోని కాలనీ ఇప్పుడిప్పుడే ముంపునీటి నుంచి బయటపడ్డాయి. గ్రామాల్లో రహదారులు వరదనీటితో దెబ్బతిన్నాయి. అక్కడక్కడా బురదలో దర్శనమిస్తున్నారు. ముంపు ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. గ్రామాల్లో బ్లీచింగ్, ఎబేట్, ఫాగింగ్‌ చేయాలని అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు. పశువులకు వరస వరదలతో మేతల్లేక ఇబ్బందులు పడుతున్నామని పాడి రైతులు చెబుతున్నారు.

రాయవరంలో వైభవంగా సరస్వతీ పూజలు

రాయవరం: స్థానిక ఈశ్వరరెడ్డి నగర్‌లో ఆదివారం సరస్వతీ పూజలు వైభవంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీ గణపతి వినాయక కమిటీ ఆధ్వర్యంలో వినాయక మంటపాన్ని ఏర్పాటు చేశారు. నవరాత్రి చివరి రోజు చిన్నారులచే విద్యాకల్పన పూజలు చేయించారు. గణపతి విగ్రహం వద్ద కమిటీ ఆధ్వర్యంలో పెన్నులు, పుస్తకాలు ఉంచి పూజాదికాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన సుమారు 100 మంది చిన్నారులు, విద్యార్థులు ఈ పూజల్లో పాల్గొన్నారు. ప్రధానార్చకుడు యలమంచిలి సత్యనారాయణశర్మ అర్చకత్వంలో పూజాదికాలు జరిగాయి. సుమారు 1,100 పెన్నులు స్వామి వారి వద్ద ఉంచి పూజల అనంతరం వాటిని భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వినాయక మండపం కమిటీ సభ్యులు పులగం శ్రీనివాసరెడ్డి (పీఎస్‌ఆర్‌), కొవ్వూరి రామారెడ్డి, పులగం శ్రీనివాసరెడ్డి (మందుల షాపు శ్రీను), కోనాల సుధాకరరెడ్డి, సబ్బెళ్ల జగదీశ్వరరెడ్డి తదితరులు మాట్లాడుతూ తొమ్మిది రోజులపాటు స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు, రోజు 108 రకాలతో స్వామి వారికి ఫలార్చన చేసినట్లు తెలిపారు. అనంతరం చిన్నారులకు అన్నసమారాధన నిర్వహించారు.

సరస్వతీ మాతకు పూజలు

రామచంద్రపురం రూరల్‌: మండలంలోని నరసాపురపుపేట గణేశ్‌నగర్‌లో వేంచేసిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం సరస్వతీ మాతకు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు చక్రవర్తుల వేణుగోపాలాచార్యుల బ్రహ్మత్వంలో సుమారు 80 మంది చిన్నారులు సరస్వతీ దేవి పూజల్లో పాల్గొన్నారు. అలాగే మండలంలోని జగన్నాయకులపాలెం వీరభద్రుని ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద పురోహితులు దేవులపల్లి ఫణిరామకృష్ణ ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి హోమం, విశేష పూజలు నిర్వహించారు. సుమారు 2500 మందికి అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం 350 మంది ముత్తైదువలు, కన్యలతో సామూహిక సువాసినీ పూజ నిర్వహించారు. వీరభద్ర కమిటీ ఆధ్వర్యంలో పూజలో పాల్గొన్న మహిళలకు చీర, రవిక, రూపు, పూజసామగ్రి అందజేశారు.

ద్రాక్షారామలో అన్నదానం..

ద్రాక్షారామ బియ్యంపేటలో రామాలయం వద్ద జై శ్రీరామ్‌ శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గణపతి మండపం వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.



నరసాపురపుపేట గణేశ్‌నగర్‌లో చిన్నారుల సరస్వతీ పూజలు



రాయవరంలో వినాయక మంటపం వద్ద సరస్వతీ పూజల్లో పాల్గొన్న భక్తులు



జగన్నాయకులపాలెం వీరభద్రుని ఆలయం వద్ద లక్ష్మీగణపతి హోమం

22న తాలూకా శెట్టిబలిజ సమావేశాన్ని విజయవంతం చేయాలి

రామచంద్రపురం రూరల్‌: ఈ నెల 22న రామచంద్రపురం పట్టణంలోని శెట్టిబలిజ కమ్యూనిటీ హాలులో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న తాలూకా శెట్టిబలిజ సంఘం సమావేశాన్ని విజయవంతం చేయాలని శెట్టిబలిజ నాయకులు ఆదివారం పిలుపునిచ్చారు. మండలంలోని కందులపాలెం, కాపవరం, తాడిపల్లి, యనమదల, ఓదూరు, నరసాపురపుపేట, చోడవరం గ్రామాల్లో రాష్ట్ర ఇండస్ట్రియల్‌ కార్పొరేషన్‌ మాజీ డైరెక్టర్‌ వాసంశెట్టి శ్యామ్‌ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో శెట్టిబలిజ సంఘ పెద్దలు, సభ్యులు, యువతను సమావేశానికి ఆహ్వానించి మాట్లాడుతూ శ్యామ్‌ 22న ఆదివారం తాలూకా శెట్టిబలిజ సంఘం గౌరవాధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్‌ అధ్యక్షతన సంఘ సాధారణ సర్వ సభ్యుల సమావేశం అనంతరం నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గంలోని శెట్టిబలిజ సంఘ పెద్దలు, యువత పాల్గొని నూతన కార్యవర్గంగా సమర్థవంతమైన నాయకత్వం, సంఘ ప్రతిష్ఠకు కృషి చేయాలన్నారు. 22 సమావేశం కరపత్రాలను పంపిణీ చేశారు. సర్పంచ్‌లు కట్టా గోవిందు, పంపన వీరవెంకటరమణ, ఎంపీటీసీలు పంపన ఏడుకొండలు, నులుకుర్తి శ్రీరామకృష్ణ, మాజీ సర్పంచ్‌ గీసాల సత్యనారాయణ, నాయకులు పెంకే వీరరాఘవులు, గీసాల శివ, పిల్లి బాలసుబ్రహ్మణ్యం, కొప్పిశెట్టి ఏడుకొండలు, పిల్లి రాఘవ పాల్గొన్నారు.



కాపవరంలో కరపత్రాలు అందజేస్తున్న నాయకులు